క్లుప్తంగా

ఘనంగా తిరునాళ్ల



గుండాల గంగమ్మ తిరునాళ్లలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గస ముద్రం జగనన్న కాలనీలో ఆదివారం గుండాల గంగమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, దీపారాధన అనంతరం కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా మహిళలు పొంగళ్లు తీసుకువచ్చారు. అనంతరం ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ఘనంగా ఉట్లోత్సవం



ఉట్లోత్సవంలో పాల్గొన్న యువకులు

చంద్రగిరి: గోకులాష్టమి పురస్కరించుకుని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం ఎదుట ఆదివారం ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. అమ్మవారి అనుబంధ శ్రీకృష్ణ సమేత రుక్మిణి, సత్యభామలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సమూర్తులు ఆలయం వద్దకు వేంచేపు చేశారు.. దేవేరుల సమక్షంలో ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్లోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను నాలుగు మాడవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మునెమ్మకు మోహిత్‌రెడ్డి పరామర్శ



చంద్రగిరి ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి తల్లి మునెమ్మను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి మండలానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి తల్లి మునెమ్మను చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చిన్నపాటి శస్త్రచికిత్స చేసుకున్న ఆమెను ఆదివారం పరామర్శించారు. మునెమ్మ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

భక్తులకు అన్నదానం



కరిమారియమ్మ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: నిమ్మకాలయ వీధి వద్దనున్న శ్రీ కరిమారియమ్మ ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. జూలై 18 నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఇక్కడ ఆడిమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, బాబు, ఆనంద్, సుబ్రమణ్యం, మాధవ్, వెంకటరమణ, ప్రకాష్, మునస్వామి, సుబ్రమణ్యంరెడ్డి, కేఎస్.రాజా, భక్తులు పాల్గొన్నారు.

డీఎస్సీ టాపర్‌కు మంత్రి సన్మానం



ఉషారాణిని సన్మానిస్తున్న మంత్రి

తిరుపతి సిటీ: ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫైనల్ కీ మెరిట్ ఫలితాలలో స్థానిక గాంధీ రోడ్ లోని నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ విద్యార్థిని ఎం. ఉషారాణి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు. తిరుపతి పర్యటనలో ఉన్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ నారాయణ, మాజీ మంత్రి పరసారత్నం తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతమవుతాయనే

చీకటి జీఓలు..!

- విద్యార్థి సంఘాల పోరాటాలను అడ్డుకునేందుకు కుట్ర
- నేడు అంబేడ్కర్ విగ్రహాల ముందు నిరసన
- వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నేతలతో సమావేశమై మాట్లాడుతున్న ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో అవినీతి, అక్రమాలు, అన్యాయాలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతమవుతాయనే పాలకులు రాజ్యాంగవిరుద్ధమైన చీకటి జీఓలను విడుదల చేస్తోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్‌ఆర్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విద్యార్థి విభాగం ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతుకలు నొక్కేందుకు యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని, పేద విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే చీకటి జీఓల విడుదలే దీనికి నిదర్శనమని విమర్శించారు. ఆ జీఓలను రద్దు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘం నేతలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహాల ముందు నిరసన వ్యక్తం వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లో విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గమవుతాయనే భయంతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని, విద్యార్థి సంఘాలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టడానికి తాము ఉద్యమిస్తామన్నారు.

ఆ జీఓను ఎందుకు తెచ్చారు..?

టీడీపీ ప్రతి పక్షంలో ఉన్నపుడు విద్యార్థి సంఘాలు, సంఘం నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలను ఎత్తిచూపించిన ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆ జీఓను ఎందుకు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకిచ్చిన పుస్తకాల బ్యాగులు నెల రోజుల్లోనే చిరిగిపోవడం, మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడం, ఆంగ్ల బోధన అటకెక్కించడం, స్కూళ్ల విలీనం పేరిట భ్రష్టు పట్టించడం.. ఇత్యాది వాటిపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించి, నిలదీస్తుండడంతో కూటమి ప్రభుత్వం సహించలేకపోతోందన్నారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించడమే తప్పనిపిస్తే తొలుత టీడీపీకి అనుబంధ విద్యార్థి సంఘం (టీఎన్ఎస్ఎఫ్)ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదని పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డులు జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆ జీఓను వ్యతిరేకిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 18న అంబేడ్కర్ విగ్రహాల ముందు ఆందోళనకు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు ఓబుల్ రెడ్డి, ఆర్సీ పురం మండల అధ్యక్షుడు యశ్వంత్ కుమార్ రెడ్డి, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షుడు జస్వంత్ కుమార్ రెడ్డి, చంద్రగిరి మండలం అధ్యక్షులు వినోద్, ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, జిల్లా కమిటీ కార్యదర్శి ప్రదీప్ కుమార్, కార్యవర్గ సభ్యులు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహణ.
- విద్యార్థి సంఘాల అణచివేతకు ఉద్దేశించిన చీకటి జీఓలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉదయం 10 గంటలకు ఎస్వీ యూనివర్సిటీ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘ నేతల నిరసన.
- కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక.
- నవంబర్ నెల తిరుమల శ్రీవారి దర్శన కోటా టిక్కెట్లు ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల.

విస్తారంగా సజ్జ సాగు

వరదయ్యపాళెం: నియోజకవర్గంలో ప్రస్తుత సీజన్‌లో సజ్జ పంటను విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారు. అడపాదడపా పడుతున్న తొలకరి జల్లులతో సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో 350 హెక్టార్లకు పైగా సజ్జ పంట సాగు చేస్తున్నట్లు సమాచారం. ఈ పంటకు నీటి వినియోగం తక్కువ కావడం, నామమాత్రపు పెట్టుబడులతో సాగు చేసుకునే పంట కావడంతో అవకాశం ఉన్న చోట్ల సజ్జ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పంట ఏపుగా పెరిగి పలుచోట్ల ఎన్ను దశలో కూడా ఉంది.

19న ఆటో యూనియన్ జిల్లా మహాసభలు

- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ..ఆటో కుటుంబాల్లో దైన్యం
- 'యువగళం' హామీలు నెరవేర్చని మంత్రి నారా లోకేష్ : సీఐటీయూ విమర్శ



జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి కల్చరల్: ఆటో రంగ పరిరక్షణ, డ్రైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 19న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన ఆటో యూనియన్ జిల్లా మహాసభలకు ఆటో కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ఆయన జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఈ పథకం వల్ల ఆటో కార్మికులు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి రూ.15 వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా హెల్త్ ఇన్సూరెన్స్, ఆటో ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని..ఇలా హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవడం శోచనీయమని మండిపడ్డారు. జిల్లా మహాసభల్లో దీనిపై చర్చించ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, మురళి, వాసు, బాదుల్లా, రవి, మురగ, రమణ పాల్గొన్నారు.

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో రెండ్రోజుల జన సేవాదళ్ శిక్షణ శిబిరం ముగింపులో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఒంగోలులో రెడ్ షర్ట్ వలంటీర్లు, జన సేవాదళ్ కవాతుకు జిల్లా నుంచి కార్యకర్తలు వందలాదిగా హాజరవుతారన్నారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెడ్ ఆర్మీ చురుకైన పాత్ర పోషించాలన్నారు. మతోన్మాద రాజకీయాలు, ఆర్ఎస్ఎస్ భావజాలంతో అభ్యుదయ భావాన్ని అణచివేయాలని పాలకులు ప్రయత్నిన్నారని, అభ్యుదయ సాహిత్యంపై దాడి చేస్తున్నారని దీనిని తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, వినయ్, ఏఐవైఎఫ్ నేతలు రామకృష్ణ, పూర్ణ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

తిరుపతి కల్చరల్: అంబేడ్కర్, పూలే ఫౌండేషన్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంత్రి కొల్లు రవీంద్ర ,పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు పరసారత్నం మాట్లాడుతూ, తన సతీమణి కస్తూరమ్మ వైద్య వృత్తిలో ఎంతో మంది పేదలకు సేవలతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ఆమె స్మారకార్థం ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పలు కార్పొరేట్ హాస్పిటళ్ల వైద్య బృందం పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసింది. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్, ఎస్ఎల్ఎస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్‌కుమార్, అన్ని కుల సంఘాల ప్రతినిధులు ఆల్‌మెన్‌రాజు, నరసింహ యాదవ్, సీఆర్.రాజన్, బృందమ్మ, సతీష్ చంద్ర, నగేష్, పరమశివం పాల్గొన్నారు.

వేమాలమ్మకు సామూహిక పొంగళ్లు





ప్రత్యేక అలంకరణలో వేమాలమ్మ, ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని కడూరులో వేమాలమ్మ అమ్మవారికి ఆదివారం స్థానికులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో ప్రారంభం



ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షోను ప్రారంభిస్తున్న మహిళా వర్శిటీ వీసీ ఉమ

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షోను ఆదివారం శ్రీపద్మావతి మహిళా వర్శిటీ వీసీ వి.ఉమ ప్రారంభించారు. షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ, అద్వితీయమైన కళాత్మకతతో రూపొందించిన బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక బ్రాండ్లతో ధ్రువీకరించిన వజ్రాభరణాలు, ఎరా అన్‌కట్ డైమండ్స్, ప్రెష్యా జాతి రత్నాలు, ఎత్నిక్స్ హస్తకళా ఆభరణాలు, జోల్ ఆధునిక తేలికపాటి డిజైన్లు, డివైన్ భారతీయ సంప్రదాయ ఆభరణాలతో పాటు పిల్లల కోసం స్టార్లెట్ ఆభరణాలు ప్రధాన ఆకర్షణగా ఉన్నాయని, ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ షోను ఆభరణాల అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లేఔట్ల క్రమబద్ధీకరణ సద్వినియోగం చేసుకోండి

తుడా వీసీ శుభం బన్సల్

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020 పొడిగించి సవరణ ఉత్తర్వులు జీఓ నంబర్ 134 జారీ చేసిందని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ ఒక ప్రకటనలు తెలియజేశారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కల్పించడానికి, 2025 జూన్ 30 ముందు వేసిన అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను ప్రణాళికబద్ధంగా తీసుకురావడానికి ఈ పథకం కొనసాగింపు చేసినట్లు తెలిపారు. ఈ పథకం మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు వర్తిస్తుందని తెలియజేశారు. ఈ పథకంలో ఆమోదించబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ద్వారా గానీ, స్వయంగా గానీ అనధికార లేఔవుట్‌లో ఉన్న స్థలాలకు ప్లాన్లు తయారుచేసుకుని అపరాధ రుసుంలో 50% లేదా 10,000 రూపాయలకు తగ్గకుండా చెల్లించాలని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజులలోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రాలు, ప్లాన్లతో ఆన్‌లైన్ పోర్టల్ dtcp.ap.gov.in/LRLలో దరఖాస్తు చేసుకోవాలని, దీనిని అక్రమ లేఔట్ వేసిన యాజమాన్యం, అందులో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్‌ఎంపీల ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం ఆర్‌ఎంపీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి వివిధ మండలాల నుంచి 150 మంది ఆర్‌ఎంపీలు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో పేదలకు ఎలాంటి వైద్యసేవలు అందించాలి అనే దానిపై చర్చించారు. ప్రతిఒక్కరూ కుశల ప్రశ్నలు వేసుకుని సందడి చేశారు.

అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వివిధ ప్రజా, కుల సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: నగరంలోని ఏడు కాలనీల సెంటర్‌లో (ఎస్వీ మెడికల్ కళాశాల కూడలి)లో అసంపూర్తిగా ఆగిపోయిన అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని వివిధ ప్రజా, కుల సంఘాల నేతలు ఉద్ఘాటించారు. ఏడు కాలనీల మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రజా, కుల సంఘాల నేతలు ఆదివారం ఏడు కాలనీల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యమాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఏడు కాలనీల అధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్యదర్శులు వెంకటేష్, జయప్రకాష్ ,ఉపాధ్యక్షులు దేవరాజులు, అరుణ్‌కుమార్, కార్పొరేటర్ ఎస్‌కే.బాబు, అడ్వైజర్ రాజశేఖర్, దళిత సంఘ నేతలు ప్రసంగించారు. ఇక్కడ అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని అగ్రకులాల నేతలు అడ్డుకుంటున్నారని, నిర్మాణాన్ని ఆపాలని చూస్తే తిరుపతిలో అధిక శాతం ఉన్న మాల, మాదిగల ఉగ్రరూపం ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నృత్యం.. మంత్రముగ్ధం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన లాస్యధర స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు చెందిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పుష్పాంజలితో మొదలై హనుమాన్ విరుతం, రంజని, ఆనంద కూతునిన్ పదం, శ్రీకృష్ణ కామనతో, కురతలి వంటి పాటలకు చిన్నారులు తన్వి, ఇనియా, సోనియా, మహతి, సంజన, ప్రణవిక తమ నృత్యంతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

రచయిత ఆర్‌సీకే.రాజు కథాసంపుటికి పురస్కారం



ప్రథమ కథా సంపుటి పురస్కార సత్కారం అందుకుంటున్న రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు

తిరుపతి కల్చరల్: హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామిరాజును ప్రథమ కథాసంపుటి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ నిర్వహించిన కథా సంపుటాల పోటీలలో ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు రచించిన 'జక్కదొన' కథల పుస్తకానికి ప్రథమ కథా సంపుటి పురస్కారం ప్రకటించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవంలో ఫౌండేషన్ నిర్వాహకులు, పలువురు సాహితీప్రియులు తోట సుభాషిణి, మువ్వా శ్రీనివాసరావు, శ్రీరాం పుప్పాల, పిన్నంశెట్టి కిషన్ అబ్దుల్ రజాక్ హుస్సేన్ చేతుల మీదుగా కథాసంపుటి పురస్కారం ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ, జక్కదొన కథల పుస్తకంలో 21 కథలు పూర్తిగా రాయలసీమ వాసుల జీవనాన్ని ప్రతిబింబిస్తున్నాయని, సామాన్యుడి మనోగతాన్ని తెలియజేసే విధంగా ఉన్నాయని విశ్లేషించారు.

ముగిసిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



తోటోత్సవంలో యువకులు

పాకాల: ఊట్లవారిపల్లె సమీపంలోని పాళ్యం కొండపై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 77వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిసాయి. స్వామి వారిని వేకువ జామున మేల్కొపి, నిత్యకైంకర్యాలు, పూజార్చనలు, అభిషేకాలతో పాటు యాగపూజ, పూర్ణాహుతి, కలశాభిషేకం, తోటోత్సవం, ధ్వజావరోహణం, పాన్పుసేవ..ఇత్యాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక యువత తోటోత్సవంలో ఉత్సాహంగా పాల్గొంది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, ఈఓ యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉట్లోత్సవం

ఆదివారం శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులతో తిరుమల కిక్కిరిసింది. ఎటుచూసినా భక్తులే కనిపించారు. క్యూలైన్లలో భక్తులకు శ్రీవారి సేవకులు సేవలందించారు. ఎక్కడ కాస్తా చోటున్నా కూడా సేద తీరడం కనిపించింది. గోకులాష్టమి పురస్కరించుకుని ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు.–తిరుమల







ఊరేగింపుగా బయలుదేరిన మలయప్ప స్వామి, శ్రీకృష్ణ స్వామి